నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 3 డిసెంబర్ 2024 | NAGARKURNOOL

అలంపూర్ చౌరస్తాలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో భోజనం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

విద్యార్థుల భోజనంపై నిర్లక్ష్యం వద్దు

- అలంపూర్ చౌరస్తా పాఠశాలలో గురుకులబాటలో ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 2 : విద్యార్థులకు అందించే భోజనంపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే విజయుడు హెచ్చరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు.. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షణలో చేపట్టిన గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తాలో బీసీ గురుకుల బాలుర పాఠశాలను గులాబీ పార్టీ యువజన నేత కిషోర్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో పేదలకు మెరుగైన విద్యా బోధన, నాణ్యమైన, రుచికర మైన భోజనం, వసతి కల్పించినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విద్యార్థుల చదువు గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. మంచి భోజనం అందించడంలో రేవంత్ సర్కారు పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. గురుకులాల్లో చదువుపై, భోజనంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఉపాధ్యాయుడు క్రమం తప్పకుండా పాఠశాల, గురుకులాలకు వచ్చి విద్యార్థుల చదువు, భోజనం, వారి బాగోగులు చూడాలని ఆదేశించారు. ఏమైనా సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వారి వెంట సింగిల్ విండో అధ్యక్షుడు గజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వెంకట్రామయ్య, శ్రీను, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమస్యలకు నిలయాలుగా గురుకులాలు

- పాఠశాలలు జైలు అనుకుంటున్నావా? • గురుకులబాటలో పల్లయ్య

ఎర్రవల్లి చౌరస్తా, డిసెంబర్ 2 : కాంగ్రెస్ సర్కారు వచ్చాక గురుకులాల సమస్యలకు కేరాఫ్‌గా మారాయని గురుకుల బాట ఇన్‌చార్జి కురువ పల్లయ్య అన్నారు. సోమవారం ఎర్రవెల్లి మండలంలోని బీచుపల్లి, ఎర్రవెల్లిలోని అయిజ గురుకుల పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి.. గురుకులాలు జైలు అనుకుంటున్నావా..? అంటూ నిలదీశారు. బీచుపల్లి పాఠశాలలో విద్యార్థులకు తాగునీరు లేదని, రెండ్రోజులకోసారి స్నానం చేస్తున్నారని తెలిపారు. ప్రహరీ లేక పందులు ఆవరణలోకి వస్తున్నాయని, క్లాస్‌రూంల్లోకి విషసర్పాలు వస్తున్నాయని వాపోయారు. అయిజ గురుకులంలో నాణ్యమైన భోజనం లేదని, బిల్డింగ్, కిటికీలకు జాలీలు లేవన్నారు. కూరగాయలు కుళ్లిపోయి ఉన్నాయని, ఈ పాఠశాల భవన యజమానికి గతంలో 10 నెలల అద్దె బకాయి ఉండడంతో గేటుకు తాళం వేసినట్లు గుర్తు చేశారు. కేసీఆర్ పాలనలో గురుకులాలు స్వర్ణయుగంగా మారగా.. రేవంత్ హయాంలో పుడ్‌పాయిజన్‌తో విలవిలలాడుతున్నాయని ధ్వజమెత్తారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు మాజీ, మత్తాలి, మాధవ్, రాజు, రామకృష్ణ, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

అయిజ గురుకులంలో వంటగదిని పరిశీలిస్తున్న పల్లయ్య

కలెక్టర్ అనుమతి లేకుంటే .. పాఠశాలలోకి ప్రవేశం లేదంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్ద నాయకులు

గురుకులబాటకు మోకాలడ్డు

- నాణ్యమైన సరుకులు, పౌష్టికాహారం అందిస్తే భయమెందుకు.?
- బీఆర్ఎస్వీ పాలమూరు యూనివర్శిటీ కన్వీనర్ భరత్‌బాబు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబర్ 2 : సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, గురుకుల విద్యాలయాల్లో నాణ్యమైన సరుకులతో పౌష్టికాహారం అందిస్తూ.. పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ.. విద్యార్థుల సంక్షేమానికి అన్ని రకాల చర్యలు చేపడుతుంటే.. విద్యా సంస్థల్లోకి విద్యార్థి సంఘాలు, మీడియాను లోపలికి అనుమతించేందుకు ఎందుకు నిరాకరిస్తున్నారంటూ బీఆర్ఎస్వీ పాలమూరు యూనివర్సిటీ కన్వీనర్ గడ్డం భరత్‌బాబు ప్రశ్నించారు. గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లాలోని పలు విద్యా సంస్థలను బీఆర్ఎస్వీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహాలు, గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాళ్లు కలెక్టర్ అనుమతితోనే విద్యా సంస్థల్లోకి రావాలంటూ నాయకులకు సూచించారు. ఆయా విద్యాలయాల ప్రధాన గేటు, ముఖద్వారం ఎదుట కలెక్టర్ అనుమతి లేకుంటే పాఠశాలలోకి ప్రవేశం లేదంటూ ఫ్లెక్సీలు, నోటీసు బోర్డుల్లో రాసి ఉంచారు. ఈ విషయంపై పలు పత్రిక ప్రిన్సిపాళ్లను విద్యార్థి సంఘాల నాయకులు నిలదీస్తే తమకు రాష్ట్ర అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు అందాయంటూ చెప్పారు. కొన్ని చోట్ల విద్యార్థి సంఘాల నాయకులను గేటు ముందే నిలిపి విద్యార్థులతో మాట్లాడించారు. మరికొన్ని చోట్ల గేట్లు తీయకుండానే అన్ని సక్రమంగా అందిస్తున్నామని సిబ్బంది చెప్పారు.

రెండో రోజు బడిబాటలో..

బీఆర్ఎస్వీ బడిబాట కార్యక్రమంలో భాగంగా రెండో రోజు జిల్లా కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, కళాశాల, ఎస్సీ బాలికల వసతి గృహం, పిల్లలమర్రిలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను, రామిరెడ్డిగూడెంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, కళాశాల, ధర్మాపూర్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల–జడ్చర్ల, హన్వాడలోని కేజీబీవీ, మహాత్మాజ్యోతిబా పూలే బాలికల పాఠశాలను సందర్శించారు. పలు విద్యాలయాల్లో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు శ్రీకాంత్, వినయ్, భరత్, బాలునాయక్, వెంకటేశ్ నాయక్, ప్రమోద్, వినయ్ పాల్గొన్నారు.

పీఎస్ ఎదుట ఆందోళన

గద్వాల అర్బన్, డిసెంబర్ 2 : కవిత అనే మహిళ ఇచ్చిన మత్తు మందు విక్షిచి మృతి చెందిన విషయం విదితమే. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలోని శివ బాలాజీ దేవాలయం వద్ద ఆందోళనకు దిగారు. అయితే పోలీసులు కల్పించుకొని వారితో మాట్లాడారు. వైద్యులను పిలిచి మాట్లాడు దాకుని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం మృతురాలి బంధువులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని వైద్యులను పిలిపించాలని కోరారు. పోలీసు కేసు నమోదైంది.. ఇంకా ఏముంది.. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు సూచించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడే ఆందోళనకు దిగారు. పోలీసుల తీరును తప్పుబట్టారు. ఈ సంఘటనకు సంబంధించి ఉన్న తాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలియజేస్తున్న కవిత కుటుంబ సభ్యులు

రూ.2 లక్షల్లోపు ఉన్నా మాఫీ కాలే..

మాగనూరు మండలం గురురావ్ లింగంపల్లి గ్రామంలో పది ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. రూ.లక్షా 60 వేల రుణం మక్తల్ డీసీసీబీలో తీసుకున్నా.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మాఫీ అయ్యింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి రైతుకూ రూ.2 లక్షల రుణ మాఫీ చేశామని చెబుతున్నా.. నాకు మాత్రం కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాఫీ చేయాలి.

- మహదేవ్‌గౌడ్, రైతు, గురురావ్ లింగంపల్లి, మాగనూర్ మండలం

పేరు సరిచేసి చేస్తామని చేయలేదు

నారాయణపేట యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.1.60 లక్షల పంట రుణం తీసుకున్నా. రెగ్యులర్‌గా రెన్యువల్ చేశాను. బ్యాంకు అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు ఆధార్ కార్డులో బాలు నాయక్ చవాన్‌గా ఉంది.. బ్యాంకు ఖాతాలో లంబాడీ బాలుగా ఉంది. దీంతో రుణమాఫీ జరగలేదు. రెండు నెలల కిందట అధికారులు పేర్లు సరిచేసి రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. నాలుగు విడుతలుగా రుణ మాఫీ చేసినా కాలేదు. చిన్నప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ వీరాభిమానిని. నా కుమారుడు బీఆర్ఎస్ నుంచి సర్పంచ్‌గా గెలుపొందినా, నేను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నాను. కానీ నాకు రుణమాఫీ చేయకపోవడం దారుణం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మాఫీ చేయాలి.

- బాలు నాయక్, రైతు, పెద్దగుండ్ల తండా, నారాయణపేట మండలం.

రూ.2 లక్షలైనా మాఫీ కాలేదు

ధన్వాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ నుంచి రూ.2 లక్షల పంట రుణం తీసుకున్నాను. రెగ్యులర్‌గా రుణాన్ని రెన్యువల్ చేశాను. వడ్డీతో కలిపి రూ.2,03,861 అప్పు మిగిలింది. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల పైచిలుకు ఉన్నదన్న సాకుతో నాలుగు విడుతలుగా రుణమాఫీ చేయడం లేదు. ప్రభుత్వం ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నా.. ఆచరణలో అమలు కావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రుణ మాఫీ చేయాలి.

- ఇక్బాల్ ఖాన్, రైతు, ధన్వాడ

రుణమాఫీ గందరగోళం

- నాలుగు విడుతలైనా పూర్తి కానీ రూ.2 లక్షల మాఫీ
- అర్థంకాని కారణాలతో రిజెక్ట్
- నాగర్‌కర్నూల్ జిల్లాలో 6,117 మంది మాఫీకి నోచుకోని రైతులు
- అయోమయంలో రైతన్నలు

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 2 : రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమవడంతో జిల్లా వ్యాప్తంగా గందరగోళపరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నాలుగు విడుతలుగా రూ.2 లక్షలలోపు రుణం తీసుకున్న రైతులకు మాఫీ కాక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇంకా వేల సంఖ్యలో రైతులకు రుణమాఫీ పెండింగ్‌లో ఉండడంతో తమకు మాఫీ అవుతుందా? లేదా అనే అయోమయం రైతుల్లో నెలకొన్నది. అర్హత ఉన్నప్పటికీ ఎందుకు వర్తించడం లేదని ప్రభుత్వంపై అసహనం, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో వస్తే రుణమాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికి తీరా అధికారంలోకి వచ్చాక వేల సంఖ్యలో రైతులకు మొండిచేయి చూపుతున్నది. మూడు విడుతల్లో పూర్తి స్థాయిలో మాఫీ చేస్తామన్న ప్రభుత్వం నాలుగు విడుతలైనా నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇంకా 6,117 మంది రైతులకు వివిధ కారణాల చేత వర్తింపచేయలేదు. దీంతో మళ్లా రైతులు మాఫీ కోసం అధికారులకు దరఖాస్తు అందజేశారు.

రైతుల తికమక

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రుణ మాఫీ పథకంలో భాగంగా నాలుగు విడుతల్లో రూ.2 లక్షల వరకు రుణాలు మాఫీ చేశారు. అయితే ఈ పథకం కింద నాగర్‌కర్నూల్ జిల్లాలో 1,11,297 మంది రైతులకు రుణమాఫీ వర్తించగా.. ఇంకా చాలా మందికి కాలేదు. దీంతో పలు పత్రిక రైతులు ఆందోళన చెందుతున్నారు. రుణాలకు పలు నిబంధనలు ఉన్నా అంతకు తక్కువగా ఉన్నా ఆలోపు రుణాలు ఉన్న వారు సైతం నాలుగు విడుతల్లో నోచుకోలేదు. అర్హత ఉన్నా, ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని పత్రాలు అందించినా.. మాఫీ కాక పోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. నాలుగో విడుత పూర్తయ్యే నాటికి నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇంకా వివిధ కారణాలు చెబుతూ ప్రాసెస్ చేయనివి, ఆధార్‌లో రుణమాఫీలో పేరు వ్యత్యాసం ఉండడం, కుటుంబ సభ్యుల నిర్ధారణ సక్రమంగా లేదని, ఆధార్‌లోనూ, రుణమాఫీలోనూ పేర్లు వేర్వేరుగా ఉండడం, కుటుంబ సభ్యుల్లో ఉద్యోగం ఉన్నా, పాస్‌పుస్తకాలు లేవని, రేషన్‌కార్డు లేదని, ఇద్దరు రైతులకు ఒకే ఐడీ నెంబర్ ఉండన్న కారణాలు చూపి జిల్లాలో ఇంకా 6,117 మంది రైతులకు ఇవ్వలేదు. దీంతో సదరు రైతులు తిరిగి దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో మొత్తం రూ.1,17,411 మంది రుణాలు తీసుకోగా.. వివిధ కారణాలతో ఇంకా 6,117 మందికి రుణమాఫీ కాలేదు. జిల్లా వ్యాప్తంగా రూ.1,200 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

పొంతనలేని లెక్కలు

ఇచ్చిన మాట మేరకు రుణమాఫీ చేశామని మూడ్రోజుల కిందట మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రైతు పండుగలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో కర్షకులు అయోమయంలో పడ్డారు. మూడు విడుతల్లోనే పూర్తి చేస్తామన్న సర్కారు నాలుగు విడుతలుగా ఇచ్చినా మాఫీ కాలేదని పలు పత్రిక లబోదిబోమంటున్నారు. మరోసారి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని నిట్టూర్చుతున్నారు. చేస్తున్న మాఫీకి చెబుతున్న లెక్కలకు పొంతన లేదని రైతుల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో ఎలాంటి సమస్యలు లేకుండా రుణమాఫీ జరిగిందని, కాంగ్రెస్ హయాంలో అన్నీ సమస్యలే ఎదురవుతున్నాయనే అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్యాంక్ చుట్టూ ప్రదక్షిణలు

బ్యాంక్ చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నా.. రుణమాఫీ గురించి పట్టించుకోవడం లేదు. నారాయణపేట ఏపీజీవీబీలో రూ.2.10 లక్షల అప్పు తీసుకున్న. రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని, అధికారులు పైన ఉన్న రూ.10 వేలు కట్టించుకున్నారు. కట్టి మూడు నెలలు అవుతున్నా మాఫీ మాత్రం కాలేదు. ఇంతకీ రుణమాఫీ అవుతుందా..? లేదా..? అన్న విషయం కూడా చెప్పడం లేదు. అప్పు చేసి పంటకు పెట్టుబడులు పెట్టే పరిస్థితులు ఏర్పడ్డాయి.

- కే.పాండురంగారెడ్డి, రైతు, పగిడిమర్రి, ఊట్కూరు మండలం

మాకూ రుణమాఫీ చేయండి

- ప్రభుత్వం వందశాతం మాఫీ ప్రకటనలకే పరిమితం
- క్రాప్‌లోన్ మాఫీ కోసం రైతన్న ఎదురుచూపులు

నారాయణపేట, డిసెంబర్ 2 : 'తాత, ముత్తాతల కాలం నుంచి తాము వ్యవసాయం చేస్తున్నాం.. తమ తండ్రుల కాలం నుంచి బ్యాంకులో రుణాలు తీసుకొని పంటలు పండిస్తున్నాం. మీరు బ్యాంకులో రూ.2 లక్షలు అప్పు తీసుకుంటే అధికారంలోకి వచ్చిన వెంటనే మాఫీ చేస్తామని చెబితే అప్పు జేసినం.. ఇయ్యాల ముఖ్యమంత్రినేమో 100 శాతం రుణమాఫీ చేశామని చెబుతుండు. కానీ మాకు మాత్రం రుణమాఫీ కాలేదు'.. అంటూ నారాయణపేట జిల్లాకు చెందిన ఎందరో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమది కూడా తెలంగాణ ప్రాంతమని, తాము కూడా తెలంగాణ వాసులమని కానీ రుణమాఫీ ఎందుకు రాలేదో అర్థం కావడం లేదని.. అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.. నారాయణపేట జిల్లాలో మొత్తం 4.40 లక్షల మంది రైతులు ఉన్నారు. వానకాలం, యాసంగి రెండు పంటల కాలం కలిపి 1.88 లక్షల ఎకరాల్లో సాగు చేస్తుంటారు. రుణ మాఫీ కోసం ఎంత మంది రైతులు ఉన్నారో.. లేదో కానీ ఇప్పటి వరకు మొత్తం 68 వేల మంది రైతులకు మొత్తం రూ.590 కోట్లు మాఫీ అయ్యాయి. కానీ మాఫీ కానీ వారి సంఖ్య కూడా చాలానే ఉందని తెలుస్తోంది.

రైతు మనస్తాపం..

ప్రజావాణిలో ఆత్మహత్యాయత్నం

- పొలానికి వెళ్లే బాటను అన్న అడ్డుకోవడంతో వేసారి..
- అధికారులకు ఫిర్యాదు చేసినా జరగని న్యాయం

వనపర్తి, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : పొలానికి బాట ఇవ్వకుండా తన అన్న అడ్డుకోవడం.. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదంటూ.. మనస్తాపంతో రైతు కలెక్టరేట్‌లో ప్రజావాణిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన వనపర్తిలో చోటు చేసుకున్నది.

గోపాల్‌పేట మండలం ఏదుట్లకు చెందిన నరెడ్ల వెంకట్రామారెడ్డికి శేఖర్‌రెడ్డి, సాయిరెడ్డి, రామేశ్వర్‌రెడ్డి ముగ్గురు కొడుకులు. వెంకట్రామారెడ్డికి గ్రామ శివారులో రెండు చోట్ల 11 ఎకరాల పొలం ఉండగా.. ముగ్గురు కొడుకులు పంచుకున్నారు. ఇందులో రామేశ్వర్‌రెడ్డి వాటాను విక్రయిస్తే సాయిరెడ్డి తీసుకున్నాడు. అయితే సర్వేనెంబర్ 135లో ఉన్న చెలకలో సాయిరెడ్డి పొలానికి బాట లేదంటూ అన్న శేఖర్‌రెడ్డి అడ్డుకోగా ఆరు నెలలుగా బీడుగా మారింది. ఈ విషయమై గ్రామ పెద్దలు, రెవెన్యూ అధికారుల దృష్టికి సాయిరెడ్డి తీసుకెళ్లాడు. గ్రామ పెద్దలు చెప్పే యత్నం చేసినా శేఖర్ రెడ్డివినలేదు. గత వారం వనపర్తికి వచ్చి ప్రజావాణిలో ఫిర్యాదు చేసి వారం గడిచినా ఎలాంటి పురోగతి లేదని మళ్లీ సోమవారం కలెక్టరేట్‌కు వచ్చాడు. వెంట తెచ్చిన దరఖాస్తును అక్కడి ఉద్యోగులు లాగేసుకొని సాయిరెడ్డిని బయటకు పంపే ప్రయత్నం చేశారు. మనస్తాపం చెందిన రైతు వెంట ప్లాస్టిక్ కవర్‌లో తెచ్చుకున్న పాల్డన్ పౌడర్‌ను తాగి కిందపడ్డాడు. వెంటనే పోలీసులు గమనించి దవాఖానకు తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఇదిలా ఉంటే.. ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన సాయిరెడ్డి చేతిలో నుంచి దరఖాస్తు పేపర్లను కలెక్టర్‌కు ఇవ్వకుండా లాగేసుకున్నారని తెలిసింది. కాగా గత నెల 25న ప్రజావాణిలో సాయిరెడ్డి చేసిన ఫిర్యాదు తమకు అందిందని, రెండు, మూడ్రోజుల్లో సర్వేయర్‌ను ఏదుట్లకు పంపిస్తామని గోపాల్‌పేట తాసీల్దార్ తిలక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కాగా దవాఖానలో చికిత్స పొందుతున్న సాయిరెడ్డిని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి పరామర్శించారు. సమస్య ఉంటే పరిష్కరించకోవాలని.. ఇలాంటి ప్రయత్నం చేయొద్దని సూచించారు.

బాట నిలిపి వేయగా బీడుగా మారిన పొలం

మాకు న్యాయం చేయండి

ఆరు నెలలుగా మా పొలానికి బాట లేదని ఇబ్బందులకు గురి చేస్తుంటే మా సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదు.గ్రామ పెద్దలు, గోపాల్‌పేట రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మా గోడును ఆలకించేవారే కరువయ్యారు. చేసేది లేక పొలం బీడు పెట్టుకున్నం. ప్రజావాణిలో దరఖాస్తు అందించినా అధికారులు చొరవ చూపడం లేదు. ఎప్పుడూ ఏదో ఒక పని అంటూ దాటవేసుకుంటూ వెళ్తున్నారు. తమకు న్యాయం చేయాల్సిన వాళ్లు ఇలా తప్పించుకుని తిరిగితే ఎవరికి చెప్పుకోవాలి. అధికారులు చట్ట ప్రకారం న్యాయం చేయండి..

- యాదగిరిరెడ్డి, బాధిత రైతు కుమారుడు, ఏదుట్ల, గోపాల్‌పేట మండలం

జల్సాల కోసం బైక్ చోరీలు

- ఆరుగురు అరెస్టు.. పరారీలో మరో ఇద్దరు
- నిందితుల నుంచి 35 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు

స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

గద్వాల అర్బన్, డిసెంబర్ 2 : సులువుగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో బైకులను చోరీ చేస్తున్న యువకులను పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మీడియాకు ఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు.

జిల్లా కేంద్రానికి చెందిన రేణుక గత నెల 13న రాత్రి తన ఇంటి ఎదుట నిలిపి ఉన్న స్కూటీని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించగా.. గత నెల 28న పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కాగా సోమవారం ఉదయం గద్వాల టౌన్ పోలీసులు సోమవారం ఉదయం 5 గంటల సమయంలో ప్రభుత్వ దవాఖాన ఎదురుగా వాహనాలను తనిఖీ చేస్తుండగా.. బైక్‌పై వచ్చిన వ్యక్తి అనుమానంగా కనిపించాడు. బైక్‌ను ఆపి వాహన పత్రాలు చూపించాలని పోలీసులు కోరగా.. తాను బైక్‌ను ఎత్తుకొచ్చినట్లు ఒప్పుకొన్నాడు. తర్వాత విచారణ చేపట్టగా మొత్తం 8 మంది చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపాడు. రాత్రి సమయాల్లో గ్రామీణ ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి ఎవరూ లేని సమయంలో ఇండ్ల ముందు నిలిపి ఉంచే బైక్‌లను చోరీ చేసేవారమని, తర్వాత వాటిని విక్రయించి వచ్చిన డబ్బుతో జల్సా చేసేవారమని ఒప్పుకొన్నాడు. దీంతో గద్వాలకు చెందిన గాంధీ చిన్న, నాగరాజు, రఫీ, మదనాపురం మండలం దంతనూర్‌కు చెందిన నవీన్, కొత్తకోటకు చెందిన వహీద్, ఆదర్శ్‌ను అరెస్టు చేయగా.. గద్వాలకు చెందిన వంశీ, మదనాపురానికి చెందిన రాధాకృష్ణ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరి నుంచి మొత్తం వివిధ రకాల 35 బైక్‌లు, స్కూటీలు (రూ.30 లక్షలు) స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన టౌన్ ఎస్సై కళ్యాణ్ రావు, సిబ్బంది చంద్రయ్య, ఇస్మాయిల్‌కు క్యాష్ రివార్డ్ అందజేసి అభినందించారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ గుణశేఖర్, సీఐ శ్రీనివాస్, ఎస్సీ సీఐ నాగేశ్వర్‌రెడ్డి, రవి బాబు, ఎస్సైలు కళ్యాణ్‌రావు, అబ్దుల్ షుకూర్, పోలీసులు పాల్గొన్నారు.

పూసల్‌పాడ్ గుట్టపై చిరుత

- భయం భయంలో స్థానికులు

మరికల్, డిసెంబర్ 2 : మండలంలోని పూసల్‌పాడ్ గుట్టపై చిరుత సంచారాన్ని గమనించిన స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గతంలో రెండు సార్లు ఆవులు, గేదెలపై చిరుత దాడి చేసిందని, మళ్లా కనిపించడంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. రెండేండ్ల కిందట రాకొండ గుట్టపై చిరుతను అధికారులు పట్టుకున్నారు. ప్రస్తుతం అటవీ శాఖాధికారులు స్పందించి చిరుతను బంధించాలని కోరారు. ఈ విషయమై ఫారెస్టు బీట్ ఆఫీసర్ మల్లేశ్ వివరణ కోరగా రాకొండ, కోయిల్‌కొండ, మద్వార్ గుట్టపై చిరుత సంచరిస్తున్నదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కుమ్మరోనిపల్లిలో

నీటి ఎద్దడి

- మహిళలకు తీవ్ర కష్టాలు

అమ్రాబాద్, డిసెంబర్ 2 : మండలంలోని కుమ్మరోనిపల్లి వాసులు దాహార్తితో అలమటిస్తున్నారు. ఆరు నెలలుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని, బోర్లు పనిచేయడం లేదని ప్రజలు వాపోతున్నారు. బోర్లల్లో కనీసం మోటర్లు కూడా అధికారులు బిగించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచుల పదవీ కాలం ముగియగా.. పట్టించుకోవాల్సిన ప్రత్యేకాధికారులు నీటి సమస్యపై దృష్టి సారించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే సొంత మండల పరిధి అమ్రాబాద్‌లో నీటి ఎద్దడి నెలకొన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోయారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని లేకుంటే మండల కేంద్రంలో ధర్నా చేపడుతామని హెచ్చరించారు.

తాగునీటి గోడు వెల్లబోసుకుంటున్న కుమ్మరోనిపల్లి వాసులు